
హుజూరాబాద్: కల్యాణోత్సవంలో తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు


చొప్పదండి: రామాలయంలో ఏఎంసీ చైర్మన్ మహేశ్ మొక్కులు


రామడుగు: వెదిర శ్రీహరిహర క్షేత్రంలో కల్యాణోత్సవం


జమ్మికుంట: రామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు


జమ్మికుంట: కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

ఊరూరా రామయ్య కల్యాణం

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఆదివారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శ్రీసీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. పలువురు ప్రముఖులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణాల్లో ప్రత్యేకంగా అలంకరించిన వేదికలపై ఉత్సవమూర్తులు కొలువుదీరగా అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. అనంతరం ఆలయ కమిటీలు, నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు మంగళహారతులతో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు సీతారాముల కల్యాణం తిలకించారు. భక్తుల సౌకర్యం కోసం చలువ పందిళ్లు, దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు.


హుజూరాబాద్: పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్


మానకొండూర్: కొండపల్కలలో పల్లకిలో ఊరేగింపు


మానకొండూర్: అన్నారంలో తాళిబొట్టు చూపిస్తున్న పూజారి


జమ్మికుంట: పట్టువస్త్రాలు సమర్పిస్తున్న భక్తులు


శంకరపట్నం: కేశవపట్నంలో శ్రీరామనవమి వేడుకలు


మానకొండూర్‌లో స్వామివారి ఎదుర్కోలు



గన్నేరువరంలో శ్రీసీతారాముల కల్యాణం, ఖాసింపేట మానసాదేవి ఆలయంలో..



సైదాపూర్‌లో సీతారాముల కల్యాణం, బొమ్మకల్‌లో అన్నదానం

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేశ్

చిగురుమామిడి: డీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ చేపట్టే లక్ష కిలోమీటర్ల రథయాత్ర పోస్టర్‌ను డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తాల్ల నరేశ్ మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. మినీబస్టాండ్ ఎదుట రథయాత్ర పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్య స్థాపన కోసం విశారదన్ మహారాజ్ రాష్ట్ర వ్యాప్తంగా 14వ తేదీ నుంచి రథయాత్ర నిర్వహిస్తున్నారని, రథయాత్ర ప్రారంభ సభ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని నరేశ్ కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో డీఎస్పీ మండల అధ్యక్షుడు ఎనగందుల అనిల్, ప్రధానకార్యదర్శులు శ్రీకాంత్, సురేశ్, నాయకులు రాజ్‌కుమార్, హరీశ్, సాగర్, శ్రీమహారాణి పాల్గొన్నారు.

కళలను కాపాడుకోవాలి


మాట్లాడుతున్న శ్రీనాథ్‌రెడ్డి, తదితరులు

గన్నేరువరం: ప్రాచీన కళలను కాపాడుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీమలకుంటపల్లెలో గ్రామ యువకులు మూడు రోజులుగా చిడతల రామాయణం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన శ్రీరామపట్టాభిషేకం కార్యక్రమాన్ని తిలకించి రూ.ఐదువేలు అందజేశారు. హైటెక్ యుగంలో ప్రాచీన కళలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రామాయణం గురువు దీటి రాజు, కుసుంబ తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు బామండ్ల ఆంజనేయులు, జంగిటి ప్రకాశ్, రమేష్, ధానబోయిన లక్ష్మయ్య, బామండ్ల అజేందర్, పకిడి వీరేశం, కర్ర కొమురయ్య, కుసుంబ శ్రీకాంత్, గాజే రాజశేఖర్, లాసాని హరీష్, బామండ్ల నర్సయ్య, సొంబు రాజయ్య, లాసాని చిరంజీవి, లాసాని సంతోష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా

శంకరపట్నం: మండలంలోని మక్త గ్రామనికి చెందిన షేక్ అజీమ్, రెహమాన్ కుటుంబాన్ని స్నేహితులు ఆదివారం పరామర్శించి రూ.28,800 అందించారు. ఇటీవల కేశవపట్నం బస్టాండ్ సమీపంలో లారీ ఢీకొని అజీమ్, రెహమాన్ మృతిచెందిన విషయం తెలిసిందే. అజీమ్‌తో కలిసి చదువుకున్న 2004–05 పదో తరగతి విద్యార్థులు మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. అనంతరం 75 కేజీల బియ్యం అందజేశారు.

ఏటా ఇబ్బందులు.. ఎవరూ పట్టించుకోరు..

- తాగునీటికి తంటాలు పడుతున్న నవాబుపేట గ్రామస్తులు
- నిరుపయోగంగా రక్షిత మంచినీటి బావి
- భారీ వర్షాలకు కొట్టుకుపోయిన పైపులైన్
- గత ప్రభుత్వ హయాంలో ఖాళీబిందెలతో నిరసన తెలపడంతో కేసులు
- నేటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్న యువకులు


నిరుపయోగంగా రక్షిత మంచినీటి బావి

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట గ్రామం ఎస్సీ, బీసీ కాలనీల్లోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పదిహేనేళ్ల క్రితం గ్రామస్తులు మంచినీటి కోసం తవ్విన బావి నిరుపయోగంగా ఉంటోంది. బావి నుంచి గ్రామంలోని ట్యాంకుల వరకు వేసిన పైపులైన్ భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. గ్రామంలో 12 వార్డులున్నాయి. 24 సింగిల్‌ఫేజ్ మోటార్లు, 1200 నల్లా కనెక్షన్, మూడు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులున్నాయి. వీటితో పాటు రక్షిత మంచినీటి బావి ఉంది. సింగిల్‌ఫేస్ బోర్ మోటార్లు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులతో తరుచూ కాలిపోతున్నాయి. మరమ్మతుకు జీపీలో తగినబడ్జెట్ లేకపోవడం, సకాలంలో మిషన్‌భగీరథ పథకం నీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నుంచి మిషన్‌భగీరథ పథకం నీరు సరఫరా చేస్తున్నారు. ఎండ తీవ్రత పెరగడం వల్ల మిషన్‌భగీరథ పథకం నీరు నామమాత్రంగా వస్తోంది. తొమ్మిది, పది, పదకొండు వార్డుల్లో తీవ్ర నీటి ఎద్దిడి నెలకొంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన తాగునీటి సమస్య తీరడంలేదని వాపోతున్నారు. టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేసినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఇలా వచ్చి అలా వెళ్తున్నారు కానీ సమస్య పరిష్కారం కావడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించి రక్షిత మంచినీటి బావి నుంచి పైపులైన్ వేసి ట్యాంకుకు కనెక్షన్ ఇస్తే నీటి ఎద్దడి తీరే అవకాశం ఉందని గ్రామస్తుల అభిప్రాయం. 2005లో రూ.పదిలక్షలతో రక్షిత మంచినీటి బావిని తవ్వి పైపులైన్ కూడా వేశారు. భారీ వర్షాలకు వాగులో వరదనీరు పొంగిపొర్లగా పైపైన వేసిన పైపులైన్ వరదలో కొట్టుకుపోయింది. అప్పటి నుంచి బావిని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామస్తులకు తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. బీఆర్ఎస్ పాలనలో గ్రామస్తులు ఖాళీ బిందెలతో తాగునీటి కోసం అప్పటి ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు స్వాగతం పలికారు. అయినా నీటి ఎద్దడి నివారించలేకపోయారు. ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన యువకులపై కేసులు నమోదయ్యాయి. 2018లో తాగునీటి కోసం నిరసన వ్యక్తం చేసిన 13 మందిపై కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.


నవాబుపేట బీసీ కాలనీలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పనిచేయని బోర్‌వెల్

ఇబ్బందులు పడుతున్నాం


ఏటా వేసవిలో తాగు, నిత్యావసరాల కోసం ఇబ్బందులు పడుతున్నాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు, ఇదేంటని నిలదీస్తే కేసులు పెడుతున్నారు. వ్యవసాయబావుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తుంది.

– పిల్లి రమేశ్, 9వ వార్డు, నవాబుపేట

పట్టించుకోవడం లేదు


బీసీ, ఎస్సీ కాలనీల్లో తాగు నీటి కొరత తీవ్రంగా ఉంది. కనీసం స్నానాలు చేసేందుకు కూడా నీరు లేక ట్యాంకర్‌కు రూ.ఐదు వందలు పెట్టి నీళ్లు తెప్పించుకున్నాం. అధికారులెవరూ పట్టించుకోవడంలేదు.

– హన్మాండ్ల సత్యనారాయణ మాజీ వార్డు సభ్యుడు

ట్యాంకర్ ద్వారా సరఫరా


గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నాం. నీటి సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లాం. నిధుల మంజూరుకు మంత్రి హామీ ఇచ్చారు. సమస్య త్వరలో పరిష్కారమవుతుంది.

– రాజులునాయుడు గ్రామ ప్రత్యేకాధికారి, ఏవో, చిగురుమామిడి

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


హుజూరాబాద్‌లో ఆవిర్భావ వేడుకలు


చొప్పదండి: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


మానకొండూర్‌లో ఆవిర్భావ దినోత్సవం

హుజూరాబాద్: పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ, గ్రామ అధ్యక్షులు పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతోనే దేశవ్యాప్తంగా పార్టీ విజయం సాధిస్తోందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం మరింత అభివృద్ధి చెందుతోందని, ప్రపంచంలో దేశానికి గుర్తింపు వచ్చేలా మోదీ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో నాయకులు పార్టీ జెండా ఆవిష్కరించారు.

చిగురుమామిడి: హైందవ ధర్మ పరిరక్షణ కోసం బీజేపీ నిరంతరం కృషిచేస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్ అన్నారు. చిగురుమామిడిలో పార్టీ జెండా ఎగురవేశారు. ఈ

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో పార్టీ జెండాను నరేందర్ ఆవిష్కరించారు.

గన్నేరువరం: మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి, రుద్రారం గ్రామాలలో ఆవిర్భాదినోత్సవం నాయకులు ఘనంగా జరుపుకున్నారు.

జమ్మికుంట: పట్టణంలో పార్టీ అధ్యక్షుడు కొలకాని రాజు, మండలంలోని మడిపల్లిలో మండల ప్రధాన కార్యదర్శి రామిడి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. రెండు ఎంపీ సీట్లతో బీజేపీ ప్రస్థానం మొదలైందని, నేడు దేశంలోనే బలమైన పార్టీగా ఎదిగిందని, రాబోయే రోజుల్లో తెలంగాణలో పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చొప్పదండి: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం చొప్పదండిలో ఘనంగా నిర్వహించారు. మార్కెట్ చౌరస్తాలో జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. దేశాయిపేటలో గ్రామశాఖ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.

మానకొండూర్: మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు కంది రాజిరెడ్డి మాట్లాడారు. దేశంలో అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అని, ప్రధాని నరేంద్రమోదీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు.

బీటీ రణదివె ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం



బీటీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కరీంనగర్: సీఐటీయూ తొలి అధ్యక్షుడు బీటీ రణదివే ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి అన్నారు. బీటీ రణదివే వర్ధంతి సందర్భంగా ఆదివారం సంఘ కార్యాలయంలో బీటీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీ పిలుపు మేరకు సహాయ నిరాకరణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని అన్నారు. 1928లో మార్క్సిస్ట్ సిద్ధాంతంకు ఆకర్షితుడై కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా చేరినట్లు తెలిపారు. కార్మికుల సమస్యలపై పోరాటం మొదలు పెట్టి టెక్స్‌టైల్ యూనియన్ లీడర్‌గా, జీపీఐ రైల్వే యూనియన్ కార్యదర్శిగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, నగర కార్యదర్శి పుల్లెల మల్లయ్య, నాయకులు మోహన్‌రెడ్డి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడిగా రమేశ్‌గౌడ్


నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్: కాంగ్రెస్ పార్టీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడిగా బండారి రమేశ్‌గౌడ్‌ను నియమించినట్టు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం నియామక పత్రం అందించారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజలు, కార్యకర్తల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి, కాంగ్రెస్ నాయకులకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, పాత, కొత్త అనే భేదం లేకుండా కలిసి పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎల్ గౌడ్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రలో విధిగా నియమాలు పాటించాలి

కరీంనగర్‌కల్చరల్: హజ్ యాత్రకు వెళ్లే వారు విధిగా నియమాలు పాటించాలని హజ్ ట్రైనర్ ముఫ్తి అసీవుద్దీన్ నద్వి అన్నారు. ఆదివారం నగరంలోని గోదాంగడ్డలో గల ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో లబ్బయిక్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. లబ్బయిక్ హజ్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ ఇర్ఫాన్, ఉపాధ్యక్షుడు హఫిజ్ ముదస్సిర్ రహమాన్, ప్రధాన కార్యదర్శి హాఫిజ్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కరీంనగర్: సిద్దిపేట జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన జనార్దన్‌రెడ్డిని ఆదివారం కరీంనగర్‌లోని గణేశ్‌నగర్‌లో ఆయన స్నేహితులు సన్మానించారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, కోర్టుల సముదాయాల అభివృద్ధికి ప్రభుత్వం, న్యాయశాఖ ద్వారా నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని జనార్దన్‌రెడ్డి అన్నారు. సన్మానించిన వారిలో మహేందర్‌రెడ్డి, అడ్వకేట్ మహేందర్, రాజేందర్, సృజన్‌కుమార్, అశోక్, తదితరులున్నారు.